క్లుప్తంగా

వ్యవసాయ క్షేత్రాల సందర్శన



వేమూరులో సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న పీఏసీయస్ అధికారులు

తిరుపతి రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధికారులు పొలం బాట పట్టారు. సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సులో భాగంగా బుధవారం తిరుపతి రూరల్ మండలం వేమూరులోని సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. దేశీ వరి పంటలో అతి తక్కువ ఖర్చుతో కలుపు యంత్రాలను ఉపయోగించడంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ సంధ్యారాణి, ఆదర్శ రైతు అయ్యప్పనాయుడు, రైతులు పాల్గొన్నారు.

తుడాలో ఘనంగా ఆయుధపూజ



పూజలు నిర్వహిస్తున్న తుడా ఉపాధ్యక్షుడు, సిబ్బంది

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థలో బుధవారం సాయంత్రం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.మౌర్య వాహనాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపావళి వేళ అందరి కుటుంబాల్లో వెలుగులు నిండాలని, నగర ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. తుడా సెక్రటరీ వెంకట నారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య, సుజన, సుగుణ, దేవికుమారి, మోహన్ పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో నాశమైన వరిపైరు (ఫైల్)



ధ్వంసమైన అరటి తోటను చూపుతున్న రైతు (ఫైల్)



ఏనుగుల పాదముద్రలు (ఫైల్)



భీకరి భయం

ఏనుగుల పేరు వినపడితేనే పాకాల మండలంలోని రైతులు ఉలిక్కిపడుతున్నారు. భీ'కరి' పాదాల కింద నలిగిన పంటలను గుర్తుచేసుకుని ఆందోళన చెందుతున్నారు. పోయిన ప్రాణాలను జ్ఞప్తికి తెచ్చుకుని వణికిపోతున్నారు. అన్నదాతల ఆవేదనను పట్టించుకోని పాలకుల వైఖరిపై మండిపడుతున్నారు. గజరాజుల కట్టడికి చర్యలు చేపట్టని అటవీశాఖ అధికారుల తీరును విమర్శిస్తున్నారు. నష్టపోయిన పంటలకు కనీసం పరిహారం కూడా చెల్లించడం లేదని వాపోతున్నారు.

- ఏనుగుల సంచారంపై అన్నదాతల ఆందోళన
- పంటలు నాశనం చేస్తున్నాయని ఆవేదన
- ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆక్రోశం



పాకాల మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్)

పాకాల : మండలంలోని పలు గ్రామాలపై తరచూ ఏనుగుల గుంపు దాడి చేస్తోంది. యథేచ్ఛగా పంటలను ధ్వంసం చేస్తోంది. అలాగే కనిపించిన మామిడి, కొబ్బరి, అరటి చెట్లను విరిచేస్తోంది. వరి, కూరగాయల పంటలను తొక్కి నాశనం చేస్తోంది. ఏనుగులను దారి మళ్లించే క్రమంలో కొందరు రైతులు గాయపడుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలే కోల్పోతున్నారు.

పకడ్బందీగా చర్యలు చేపట్టాలి

గజరాజుల నుంచి పంటలు, ప్రాణాలను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అటవీ సరిహద్దుల్లోని గ్రామాలు, చెరువులు, కాలువలు, నీటి ప్రాజెక్టులు ఉన్న ప్రాంతాల్లో కందకాలు తవ్వించాలని సూచిస్తున్నారు. అలాగే ఏనుగులు అడవి నుంచి బయటకు వచ్చే మార్గాలను గుర్తించి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలంటున్నారు. ఇందుకోసం అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిహారానికి ఇక్కట్లు

పాకాల మండలంలోని పదిపుట్లబైలు, పేరసానిపల్లె, పుల్లావాండ్లపల్లె, ఎర్రేపల్లె, ఈ–పాలగుట్టపల్లె, ఈ–పాలగుట్టపల్లె దళితవాడ, రమణయ్యగారిపల్లె, చంద్రగిరివారిపల్లె, కాకర్లవారిపల్లె, మొరవపల్లి, వెంకట్రామాపురం, వరదప్పనాయుడుపేట, లక్ష్మీపురం, శేషాపురం, గానుగపెంట, మద్దినాయనపల్లె ప్రధానంగా గజ బాధిత గ్రామాలు. వీటిలోని కొన్ని గ్రామాల్లోని రైతుల పొలాలు చిత్తూరు జిల్లా పరిధిలోకి వస్తాయి. దీంతో ఏనుగుల దాడిలో పంట నష్టపోతే ఎవరికి తమ సమస్య చెప్పుకోవాలో రైతులకు తెలియడం లేదు. దీనికితోడు అధికారులు కూడా అంతంతమాత్రంగానే స్పందిస్తున్నారు. ఈ క్రమంలో నష్టపోయిన పంటకు రైతులు పరిహారం పొందలేక పోతున్నారు.



ఏనుగు దాడిలో మృతి చెందిన తమిళనాడు వాసి (ఫైల్)

అధికారులు స్పందించాలి



ఏనుగుల గుంపు నేను సాగు చేస్తున్న వరి పంటను నాశనం చేశాయి. మొత్తం 3 ఎకరాలకు గాను 2 ఎకరాల్లో పంట పూర్తిగా పోయింది. సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం పరిహారం మంజూరు చేయాలి. దీనిపై అధికారులు స్పందించాలి.

- వై.నరసింహులు, రైతు, పుల్లావాండ్లపల్లె

గ్రామాల్లోకి రాకుండా చూడాలి



ఏనుగుల గుంపులు అడవుల నుంచి గ్రామాల్లోకి రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. అలాగే రాత్రి సమయాల్లో వాటి జాడను కనిపెట్టి, ఏనుగులు వచ్చే మార్గాలను గుర్తించాలి. పగటి పూట ఆయా మార్గాలను దారి మళ్లించే విధంగా మార్చేయాలి. పంట నష్టపోతే వెంటనే పరిహారం ఇప్పించాలి.

- సి.హేమంత్‌రెడ్డి, రైతు వరదప్పనాయుడుపేట

కమిటీని ఏర్పాటు చేశాం

ఏనుగుల గుంపు పంట పొలాలను నాశనం చేయకుండా ఉండడానికి గట్టి చర్యలు చేపడుతున్నాం. అలాగే అవి జనావాసంలోకి రాకుండా జాగ్రత్తలు చేపట్టేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేశాం. తద్వారా ముందుగా ఏనుగుల జాడను పసిగట్టి, వాటిని దారి మళ్లించేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ఏనుగులను కౌండిన్య అభయారణ్యంలోకి మళ్లించేందుకు అన్నివిధాలా కృషి చేస్తున్నాం.

- పి.మాధవి,ఎఫ్ఆర్ఓ, పనపాకం రేంజ్

ఘనంగా ఆయుధ పూజ



పాకాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న సిబ్బంది

పాకాల : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. బుధవారం ఏడీ జీవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్‌లోని ప్రదేశాలను శుభ్రపరిచారు. అలాగే పలురకాల పూలు, మామిడి తోరణాలతో స్టేషన్‌ను అందంగా అలంకరించారు. ప్రమాదాలు జరగకుండా, అంతా మంచే జరగాలని, విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని దేవుణ్ణి ప్రార్థించారు. గుమ్మడి కాయ కొట్టి దిష్టి తీశారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రశాంత్, హరిప్రసాద్, సబ్ ఇంజినీర్ చంద్రప్రకాష్, ఎల్ఐ గురునాథం, లైన్‌మెన్లు రజిని, త్యాగరాజు పాల్గొన్నారు.

వల్లభాయ్ కృషి ఎనలేనిది



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపల్, విద్యార్థులు

పాకాల : స్వదేశ సంస్థానాల విలీనం ద్వారా భారతదేశం సమైక్యంగా ఉండడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి ఎనలేనిదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.మొహిద్దీన్‌బాషా తెలిపారు. బుధవారం ఎన్‌సీసీ, ఎన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. జాతీయ సమైక్యతకు సంబంధించిన నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ మాసిలామని, అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భవనాల పరిశీలన



ఎస్సీ కార్పొరేషన్ భవనాలను పరిశీలిస్తున్న కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

తిరుపతి కల్చరల్: తిరుపతి మంగళంలోని ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన భవనాలను కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను పునర్నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో ఆమె భవనాల పరిస్థితిని పరిశీలించారు. భవనాల్లో అక్రమంగా అద్దెలు వసూలు చేస్తున్న వారిని హెచ్చరించారు. అధికారికంగా భవనాలను కేటాయించిన వారే దుకాణాలను నిర్వహించుకోవాలని ఆమె ఆదేశించారు. త్వరలోనే పాత భవనాలను తొలగించి కొత్త భవనాలను నిర్మిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

జీవితాల్లో వెలుగులు నిండాలి


గురుమూర్తి, ఎంపీ


చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


వెంకటేశ్వర్, కలెక్టర్


శుభం బన్సల్, జేసీ


సుబ్బరాయుడు, ఎస్పీ

తిరుపతి అర్బన్ : దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఎంపీ గురుమూర్తి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బాణసంచా కాల్చేప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలోనే కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్ శుభాకాంక్షలు తెలిపారు.

భర్త ప్రాణాలు కాపాడాలని వేడుకోలు



మాట్లాడుతున్న బాధితురాలు అశ్వని

తిరుపతి కల్చరల్ : కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన భర్త ప్రాణాలు కాపాడుకునేందుకు సాయం అందించాలని కలకడ మండలం, గుడిబండ, తెట్టు గ్రామానికి చెందిన అశ్వని కోరింది. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో బిడ్డలతో కలిసి తమ కష్టాలను ఆమె వివరించింది. ఇప్పటి వరకు రూ.5లక్షలు అప్పు చేసి చెన్నై గ్లోబల్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామన్నారు. కాలేయ మార్పిడికి రూ.50లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని వెల్లడించింది. అంత స్తోమత తమకు లేదని, దాతలు స్పందించి ఆదుకోవాలని విన్నవించింది.

'అపార్'పై అవగాహన


మాట్లాడుతున్న హరికుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. వీరికి అపార్ స్పెషల్ ఆఫీసర్ ఎం.హరికుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థుల అపార్ ఐడీ నంబర్‌ను ఎలా క్రియేట్ చేయాలో వివరించారు. సందేహాలుంటే 99660 32691, 94900 58722 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఆర్ఐఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అపార్ ఐడీని సృష్టించాలని, అన్ని కళాశాలల యాజమాన్యాలు దీనిపై దృష్టి సారించాలన్నారు.

టీటీడీ సహకార బ్యాంక్ పాలకవర్గం ఎన్నిక




కిషోర్‌కుమార్ ,మహేష్, మునివెంకటరెడ్డి

తిరుపతి సిటీ/ అలిపిరి : టీటీడీ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ (టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంక్) పాలక వర్గ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి ఎన్నిక ముగిసింది. అధ్యక్షుడిగా ఆర్.కిషోర్ కుమార్, ఉపాధ్యక్షుడిగా టి.రమేష్, కోశాధికారిగా ఏ.మునివెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ఉమాపతి అధికారికంగా బుధవారం సాయంత్రం ప్రకటించారు.

దీపావళి శోభ

- తిరునగరిలో దీపావళి సందడి
- గ్రీన్ టపాసుల కొనుగోలుకు మొగ్గు
- లక్ష్మీపూజ సామగ్రి విక్రయాలతో బిజీబిజీ
- వర్షం పడడంతో బాణసంచా విక్రయదారుల అవస్థలు


బాణసంచా కొనుగోలు చేస్తున్న నగర వాసులు


తిరుపతిలో మట్టిప్రమిదలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న జనం

తిరుపతి కల్చరల్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి జరుపుకుంటారు. ఈ పండుగను కులమతాలకు అతీతంగా దేశమంతటా ప్రజలందరూ ఆందోత్సాహాల నడుమ దీపావళి జరుపుకోవడం ఆనవాయితీ. దీపావళి అంటే దీపాల వరుస(సమూహం)అని. చుట్టూ ఉన్న చీకట్లను పారదోలి వెలుగు నింపడానికి సంకేతంగా ఈ పండుగ చేసుకుంటారు. గురువారం దీపావళి పండుగను తిరుపతి నగరవాసులు ఆనందోత్సాహాల నడుమ జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. పండుగ కోసం కొత్తదుస్తులు, టపాకాయలు, స్వీట్లు కొనుగోళ్లతో తిరుపతి నగరంలో సందడి కనిపించింది. దీంతో నగరంలోని వస్త్ర దుకాణాలు, స్వీట్ షాపులు జనంతో కిక్కిరిశాయి. పూజా సామగ్రి కొనుగోలుకు జనం అధిక సంఖ్యలో రావడంతో నగరంలోని గాంధీ రోడ్డు, ఆర్‌సీ రోడ్డు, బైరాగి పట్టెడ, అన్నారావు సర్కిల్, ఇందిరా కూరగాయల మార్కెట్, మంగళం రోడ్డు తదితర ప్రాంతాలు కిక్కిరిశాయి. ప్రధానంగా గ్రీన్ టపాకాయలు కొనుగోళ్లకు జనం అధికంగా మొగ్గు చూపడం కనిపించింది. ఈసారి కేదారి నోముల వ్రతాల నిర్వహణలో ప్రజలు కొంత సందిగ్ధంలో పడ్డారు. లక్ష్మీ పూజను మాత్రం గురువారం సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు, నోము వ్రతాన్ని శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 4.30 గంటల్లోపు జరుపుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు. అయితే బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

వర్షంతో ఇక్కట్లు

నగరంలో కురిసిన వర్షానికి బాణసంచా విక్రయదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మరోవైపు బాణసంచా కొనుగోలు చేయడానికి భారీగా నగర వాసులు వచ్చారు. అయితే అకస్మాత్తుగా కురిసిన వర్షానికి దుకాణాదారులు టపాసులు తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ పట్టాలు కప్పారు. దీంతో అక్కడ కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

ప్రమిదల శోభ

దీపావళి పండుగను పురస్కరించుకుని మార్కెట్లు కొనుగోళ్లదారులతో కళకళలాడాయి. ఈసారి వినియోగదారులను ఆకర్షించే రీతిలో వ్యాపారులు భిన్నమైన రూపాల్లో ప్రమిదలను అందుబాటులో ఉంచారు. దీంతో మట్టి దీపాలు కొనేందుకు జనం ఆసక్తి చూపారు. నగరంలోని తుడా సర్కిల్, ఆర్‌సీ రోడ్డులోని రైతు బజార్, బైరాగిపట్టెడ, బాలాజీ కాలని, జ్యోతి థియేటర్ సర్కిల్ వంటి ప్రాంతాల్లో వ్యాపారులు పెద్ద ఎత్తున విక్రయించారు.


ప్రమిదలు వెలిగిస్తున్న చిన్నారులు


వర్షానికి బాణసంచా దుకాణాలకు టార్పాలిన్ కప్పిన వ్యాపారులు


కిక్కిరిసిన జనం


వర్షంలోనే పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు


వర్షంలోనే బాణసంచా తీసుకెళ్తున్న నగరవాసులు

నేడు తుమ్మలగుంటలో నరకాసుర వధ

తిరుపతి రూరల్: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, శ్రీ కళ్యాణ వెంకన్న ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలగుంటలో దీపావళి వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. రాయలసీమలోనే ప్రత్యేకంగా వేలాది టపాసులతో భారీ నరకాసుర ప్రతిమను ఏర్పాటు చేయించి, వేలాదిమంది ప్రజల మధ్య నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది 30 అడుగుల ఎత్తయిన భారీ నరకాసుర ప్రతిమను ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో 52 రకాలైన లక్ష 72 వేల టపాసులతో ఈ భారీ నరకాసుర ప్రతిమను సిద్ధం చేస్తున్నారు. చెన్నై, హైదరాబాద్, కర్నూలుకు చెందిన నిపుణులైన 12 మంది రెండు రోజులపాటు శ్రమించి ఈ టపాసుల ప్రతిమను సిద్ధం చేశారు. దీపావళి సందర్భంగా గురువారం సాయంత్రం 5.30 గంటలకు తుమ్మలగుంటలోని కళ్యాణ వెంకన్న ఆలయ ప్రాంగణంలో ఈ నరకాసుర ప్రతిమ దహనం కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు.


సిద్ధం చేస్తున్న ప్రతిమ

ఇక్కడ వసూలు.. అక్కడ పంపిణీ

- తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి చిత్రాలు
- టపాసుల విక్రేతల నుంచి మామూళ్ల రూపంలో గిఫ్ట్‌బాక్స్‌లు
- చిత్తూరులోని అనుచరులకు అందజేత

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఆధ్యాత్మిక క్షేత్రంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వింత పోకడలకు తిరుపతివాసులు నివ్వెరపోతున్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని చిత్తూరుకు చెందిన తన అనుచరులకు అప్పగించడంపై కూటమి నేతలే బాహాటంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు టపాకాయల దుకాణాల విషయంలో కూడా చేతివాటం ప్రదర్శించడంపై మండిపడుతున్నారు. నగరంలో దీపావళి పండుగ సందర్భంగా బాణ సంచా విక్రయాల నిమిత్తం పలు దుకాణాలకు కలెక్టర్ లైసెన్స్ మంజూరు చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆయా దుకాణదారులను పిలిపించి ఒక్కొక్కరు 10 గిఫ్ట్‌బాక్స్‌లను తమకు అందించాలని హుకుం జారీ చేశారు. ఈ మేరకు అందరి వద్దా వసూలు చేశారు. అయితే ఈ గిఫ్ట్‌బాక్స్‌లను చిత్తూరులోని తన అనుచరులకు పంపిణీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన నేతలు భగ్గుమంటున్నారు. ఎమ్మెల్యే ఆరణిని గెలిపించేందుకు కష్టపడి పనిచేస్తే, ఏమాత్రం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి అంశంలోనూ చిత్తూరు నుంచి వచ్చిన వలస నేతలకే ప్రాధాన్యమిస్తున్నారని మండిపడుతున్నారు.

నరక చతుర్దశి వేడుకల రద్దు

తిరుపతిలో నరక చతుర్దశి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సర్కారు సైతం రూ.9.9లక్షలు మంజూరు చేసింది. అయితే ఎమ్మెల్యే మాత్రం వేడుకలకు రూ.15లక్షలతో అంచనాలు రూపొందించారు. ఆ నిధులను విడుదల చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్యను ఆదేశించారు. ఆమె ఈ ప్రతిపాదనకు విముఖత చూపారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలోనే వేడుకలు జరిపించాలని స్పష్టం చేశారు. దీనిపై ఆగ్రహించిన ఎమ్మెల్యే చివరకు నరక చతుర్దశి వేడుకలనే రద్దు చేసేశారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


సుగంధ ద్రవ్యాలను తీసుకొస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు


సుగంధ ద్రవ్యాలతో సంప్రోక్షణ చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

- నేడు కోదండరామస్వామి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఈనెల 31వ తేదీ గురువారం దీపావళి ఆస్థానం జరుగుతుంది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం 7 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఇందులో భాగంగా ఆలగాన్ని శుద్ధి చేసి పసుపు, కుంకుమ, చందనం, సీకాయ, నామం, కర్పూరం, కిచిలీగడ్డ, కస్తూరి పసుపు, పచ్చాకు వంటి వాటితో తయారు చేసిన సుగంధ ద్రవ్యాన్ని గర్భాలయ గోడలకు పూశారు. అనంతరం 11 గంగటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, వీజీఓ సదాలక్ష్మి, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలయానికి పరదాలు విరాళం

తిరుపతికి చెందిన మణి అనే భక్తుడు శ్రీకోదండరామస్వామి ఆలయానికి బుధవారం రెండుర పరదాలు, ఒక కురాళం విరాళంగా అందజేశారు.

నేడు స్వామివారికి దీపావళి ఆస్థానం

శ్రీకోదండరామాలయంలో దీపావళి సందర్భంగా గురువారం రాత్రి 7 గంటలకు శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయం నుంచి నూతన వస్త్రాలు, దోశపడి, దీపాలు తీసుకువచ్చి శ్రీకోదండరామస్వామివారికి సమర్పిస్తారు. అనంతరం ఆలయంలో దీపావళి ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమావాస్య నాడు ఆలయంలో నిర్వహించే సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహన సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఎమ్మెల్యే గుప్పెట్లో మున్సిపల్ గెస్ట్ హౌస్

- మూడు నెలలుగా గన్‌మెన్లకు కేటాయింపు
- కార్పొరేషన్ ఆదాయానికి గండి
- తిరుపతికి వచ్చే మున్సిపల్ ఉన్నతాధికారులకు మొండి చెయ్యి
- రూ.లక్షకు పైగా కార్పొరేషన్‌కు బకాయి
- కనీస అద్దె సైతం చెల్లించని వైనం
- దృష్టి సారించాలని సామాజిక మాధ్యమాల్లో కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి


మున్సిపల్ అతిథి గృహం

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అతిథి గృహం గడిచిన మూడు నెలలుగా ఎమ్మెల్యే చేతిలోకి వెళ్లిపోయింది. ఎమ్మెల్యే తన గన్‌మెన్ల కోసం మున్సిపల్ కార్పొరేషన్ గెస్ట్ హౌస్‌ను అడ్డదిడ్డంగా వాడేస్తున్నారు. తిరుపతికి వచ్చే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు, గత కమిషనర్లు, అలానే గతంలో పనిచేసిన అధికారులకు మొండి చేయి చూపారు. రూములు ఖాళీ లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. అద్దె చెల్లించి రూముల కోసం వచ్చేవారికి గదులు ఖాళీలు లేవని చెబుతుండడంతో ఆరా తీయగా ఎమ్మెల్యే గన్‌మెన్ల కోసం రెండు గదులను కేటాయించారని తెలిసింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అలిపిరి పంప్ హౌస్ వద్ద, ఎస్వీ యూనివర్సిటీ రోడ్డు వీసీ బంగ్లా పక్కన గెస్ట్‌హౌస్‌లు ఉన్నాయి. ఒక్కో గెస్ట్ హౌస్‌లో మూడు గదులు ఉన్నాయి. ఈ గదులకు రోజుకు అద్దె అతి స్వల్పంగా రూ.500 మాత్రమే చెల్లించేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కనీస అద్దె కూడా చెల్లించకుండా గడిచిన మూడు నెలలుగా ఎమ్మెల్యే గన్‌మెన్లను అక్కడ అనధికారికంగా ఉంచారు. ఆ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఐఏఎస్ స్థాయి అధికారి కమిషనర్‌గా ఉన్న అతిథి గృహాన్ని అద్దెకు నిర్వహించలేకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలల తరబడి గన్‌మెన్‌లు అదే చెల్లించకుండా గదుల్లో తిష్ట వేసిన పండించుకోవడం లేదు. అద్దె చెల్లించి రూములో దిగేందుకు వస్తున్న పూర్వపు అధికారులు, విజయవాడలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు నో రూమ్ అని ఆన్సర్ వస్తుండడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. కమిషనర్ ఇప్పటికైనా స్పందించి మూడు నెలలుగా చెల్లించని అద్దెని వసూలు చేయడంతో పాటు గన్‌మెన్‌లను ఖాళీ చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

మున్సిపల్ కార్పొరేషన్ గెస్ట్ హౌస్‌లలో మొత్తం ఆరు గదులు ఉన్నాయి. ఒక్కో గదికి రూ.500 చొప్పున అద్దెను నిర్ణయించారు. అలిపిరి గెస్ట్ హౌస్‌లో ఉన్న మూడు గదుల్లో రెండింటిని ఎమ్మెల్యే గన్ మెన్ల కోసం కేటాయించేశారు. కనీస అద్దెను మున్సిపల్ కార్పొరేషన్ వసూలు చేయడం లేదు. మూడు నెలలకు గాను రెండు గదులకు మొత్తం రూ.లక్షకు పైగా ఎమ్మెల్యే మున్సిపల్ కార్పొరేషన్‌కు అద్దె చెల్లించాల్సి ఉంది. వీటిపై సామాజిక మాధ్యమాల్లో కమిషనర్ దృష్టి సారించాలని పలువురు నెటిజెన్లు వీడియోల రూపంలో కోరుతున్నారు. ఉచితంగా కేటాయిస్తే కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండిపడుతుందని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ చొరవ తీసుకొని మూడు నెలలుగా చెల్లించని అద్దెను వసూలు చేయడంపై దృష్టి సారించాలి.

పరిశీలిస్తాం ..

గన్‌మెన్‌లు రెండు గదులు వాడుకుంటున్న విషయం తెలియదు. గదులు కేటాయింపుపై అదనపు కమిషనర్ వివరణ తీసుకుంటాను. దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. ఆ గదులను వెంటనే స్వాధీనం చేసుకుని అందుబాటులోకి తీసుకొస్తాం.

– ఎస్.మౌర్య, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్


వర్షంలోనే ఆటోల్లో వెళ్తున్న జనం



వర్షంలోనే పూజా సామగ్రి విక్రయిస్తున్న వ్యాపారులు

దీపాల'వాన'

నగరం తడిసి ముద్దయింది. బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా వర్షం పడడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బాణసంచా, పూజసామగ్రి కొనుగోలుకు వెళ్లి వర్షంలో చిక్కుకున్నారు. – తిరుపతి ఫొటోగ్రాఫర్, సాక్షి


నగరంలో కురుస్తున్న జోరు వర్షం


రోడ్డుపై భారీగా ప్రవహిస్తున్న వర్షపునీరు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీత, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, సినీ నటుడు ప్రదీప్ మాచిరాజు, సినీ నటి ప్రేమ తదితరులు తిరుమల శ్రీవారిని బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. ఇదిలా ఉంటే తిరుమలలో జోరు వర్షం కురిసింది. తిరుమల శ్రీవారి దర్శించుకుని బయటకు వచ్చిన భక్తులు పరుగులు తీస్తూ షెడ్ల కిందకి వెళ్లారు. కొద్ది గంటల పాటు తిరుమలలో దుకాణాల సంఖ్య మూసివేశారు.

దీపావళి పండుగ పర్వదిన శుభాకాంక్షలు

సీఎం చంద్రబాబుకు వినతి


సీఎంకు సమస్యలను విన్నవిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో బీసీల సమస్యలను పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నాగరాజ గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బీసీ నేతలతో కలిసి ఆయన అమరావతిలోని సీఎం నివాసంలో చంద్రబాబును కలిసి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన బీసీలందరికీ అందించాలని కోరారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి రాజకీయ అవకాశాలు కల్పించాలన్నారు. బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. వారి వినతిపై సీఎం సానుకూలంగా స్పందించారని నాగరాజ గౌడ్ తెలియజేశారు.

అమరవీరులకు ఘన నివాళి


అమరవీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది

తిరుపతి కల్చరల్: అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్సు సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి అమర వీరులకు బుధవారం ఘన నివాళులు అర్పించారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు కొవ్వొత్తుల ర్యాలీని టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ ర్యాలీ టాస్క్‌ఫోర్సు కార్యాలయం నుంచి నంది సర్కిల్ మీదుగా తిరిగి టాస్క్ ఫోర్సు కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం అమర వీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ సురేష్ కుమార్,ఎస్ఐ రఫీ, ఎఫ్ఆర్‌వోలు, ఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక


నూతన ప్రతినిధులకు నియామక పత్రం అందజేస్తున్న సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మురళి

తిరుపతి కల్చరల్: ఇండియన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ సెల్ తిరుపతి నగర నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి తెలిపారు. బుధవారం సాయంత్రం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నగర ఉపాధ్యక్షులుగా పుత్తూరు శ్రీనివాసులు, ఉప్పు మురళి, నగర సహాయ కార్యదర్శిగా ఆవుల గురుయాదవ్‌ను నియమించినట్లు చెప్పారు. నూతన ప్రతినిధులు మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. సంస్థ నగర బాధ్యతలు అప్పగించడంపై కొత్తగా ఎన్నికైన నూతన ప్రతినిధులు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న ఎన్ఎస్‌యూ వలంటీర్లు

తిరుపతి సిటీ: స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బ్లడ్ బ్యాంక్ క్యాంప్‌లో జాతీయ సంస్కృత వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం పోలీసు అధికారులు విద్యార్థులను అభినందించి, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ చందులాల్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, బ్లడ్ బ్యాంక్ సూపర్‌వైజర్ డాక్టర్ ఠాగూర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మేరీ సుజాత, డాక్టర్ జగన్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 59,140 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 16,937 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.31 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

కుస్తీ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇటీవల విజయవాడలో రాష్ట్రస్థాయి అండర్–19 బాలబాలికల కుస్తీ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు తిరుపతిలోని ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. అపార ప్రతిభతో విజయం సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో కె.రెడ్డి జీవన, ఈ.సౌమ్య, ఆర్.లక్ష్మీలావణ్య స్వర్ణ పతకాలు, కె.సింధు రజతం, డి.నేహశ్రీ, ఎం.నీలవేణి కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి అభినందించారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి


వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పటేల్ చిత్రటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు నగరంలోని నగర పురవీధుల్లో రాష్ట్రీయ ఏక్తాదివాస్ ర్యాలీ నిర్వహించి, దేశ ఐక్యతను ఉద్దేశించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సులోచనరాణి, శివకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీడబ్ల్యూలో..

పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సమగ్ర భారతదేశ నిర్మాణానికి పటేల్ చేసిన కృషికి భారతావని ఆయనను ఉక్కుమనిషిగా కీర్తిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులచే ఐక్యతా ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ దివ్యవాణి, సుజాతమ్మ, జ్యోతి, విద్యుల్లత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో పవిత్రోత్సవాల ముగింపు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు బుధవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆలయ అర్చకులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.